క్లుప్తంగా

సీహెచ్‌సీకి ఏసీల వితరణ



సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏసీలు అందజేస్తున్న దాతలు

సామర్లకోట: ఇద్దరు దాతలు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి రెండు ఏసీలను అందజేశారు. గతంలో సామాజిక ఆరోగ్య కేంద్రానికి ఏసీలు ఇస్తామని దాతలు వేగి అప్పాజీ, కొణదల సుధాకర్ ప్రకటించారు. ఒక్కొక్కటి రూ.35 వేల విలువైన ఏసీలను సోమవారం సీహెచ్‌సీకి వచ్చిన ఎమ్మెల్యే రాజప్ప ద్వారా డాక్టర్ అమలకు అందజేశారు. దాతలను ఎమ్మెల్యే అభినందించారు.

వాహనాల తనిఖీలు ముమ్మరం



లైసెన్స్ లేని యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

పిఠాపురం: నియోజకవర్గ పరిధిలో పట్టణ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం తనిఖీలు ముమ్మరం చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. పట్టణంతో పాటు, గొల్లప్రోలు నగర పంచాయతీ, పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్ రెగ్యులేషన్, ప్రయాణికుల భద్రతపై దృష్టి సారించిన పోలీసులు.. వాహనదారులకు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అపరిచిత వ్యక్తుల కదలికలపై నిఘా ఏర్పాటు చేశామని సీఐ శ్రీనివాస్ తెలిపారు. పట్టణ ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

అనఘాదత్త క్షేత్రం వార్షికోత్సవాలు ప్రారంభం



అనఘాదత్త క్షేత్రంలో దత్తాత్రేయస్వామి

పిఠాపురం: పట్టణంలో ఉన్న శ్రీపాదవల్లభ అనఘాదత్త క్షేత్రంలో వార్షికోత్సవాలు సోమవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలకు మైసూర్ దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ, ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామీజీ విచ్చేశారు. ఆలయ వేద పండితులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీ చక్రపూజ నిర్వహించి, భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఈ నెల 23వ తేదీ వరకు అనఘాదత్త క్షేత్రంలో వార్షికోత్సవాలు జరుగుతాయి. మంగళవారం ఆలయ ప్రాంగణంలో పాదగయ రాగసాగర కచేరి నిర్వహించనున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.

సామర్లకోట అధికారులు

మున్సిపాలిటీ

మున్సిపల్ కమిషనర్	98499 05808
మున్సిపల్ మేనేజర్	98499 07118
మున్సిపల్ డీఈ	96769 68282
మున్సిపల్ ఏఈ	98499 07122
మున్సిపల్ ఆర్వో	98499 07120
మున్సిపల్ ఆర్ఐ	90146 00920
మున్సిపల్ టీపీఓ	98499 07123
శానిటరీ ఇన్‌స్పెక్టర్	77024 48282
అకౌంట్స్ ఆఫీసర్	98499 02447
ప్రభుత్వాస్పత్రి	
సూపరింటెండెంట్	80082 88125
పశు సంవర్ధక శాఖ ఏడీ	94418 60299
తహసీల్దార్	98499 03876
ఎంఈఓ-1	85558 71069
ఎంఈఓ-2	94410 73418

కొత్తపల్లి మండల అధికారులు

తహసీల్దార్	91542 47464
ఎంపీడీఓ	94401 13090
ఇంజినీర్	99890 78030
ఎలక్ట్రికల్ ఏఈ	94408 12642
హౌసింగ్ ఏఈ	70939 30455
ఈఓపీఆర్డీ	99489 27333
ఉపాధి హామీ పథకం ఏపీఓ	83744 46378
డ్వాక్రా ఏపీఎం	89788 81622
ఎస్సై	94409 00752
సీఐ పిఠాపురం	94407 96523
వ్యవసాయ శాఖ ఏఓ	83310 56594
కొత్తపల్లి పీహెచ్‌సీ డాక్టర్	99890 69546
నాగులపల్లి పీహెచ్‌సీ డాక్టర్	98497 28671
కొమరగిరి పీహెచ్‌సీ డాక్టర్	92466 90633
ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ	89858 28380
ఎంఈఓ	92467 34465
ఐసీడీఎస్ సీడీపీఓ	94408 14692
ఇరిగేషన్ జేఈ	83310 75078

ఆదాయం పుష్కలం.. సౌకర్యాలు పూజ్యం

- కార్యరూపం దాల్చని రెండో కాలిబాట వంతెన
- పదేళ్లుగా ప్రకటనలకే పరిమితం
- కానరాని సీసీ కెమెరాల వ్యవస్థ
- సామర్లకోట రైల్వేస్టేషన్ దుస్థితి



సామర్లకోట రైల్వే స్టేషన్



ప్లాట్‌ఫారాలు మారేందుకు పట్టాలు దాటుతున్న ప్రయాణికులు



మూడో నంబరు ప్లాట్‌ఫారంపై వంతెన తొలగించగా.. మిగిలిన స్తంభాలు

సామర్లకోట: రైల్వే శాఖకు ఏటా కోట్లాది రూపాయల ఆదాయాన్ని సమకూర్చుతున్న సామర్లకోట రైల్వే స్టేషన్‌లో ఆ స్థాయిలో సౌకర్యాలు అందుబాటులోకి రావడం లేదు. ప్రయాణికులకు కల్పించాల్సిన వసతులపై రైల్వే శాఖ తీవ్ర నిర్లక్ష్యం చేస్తోంది. కాకినాడ జిల్లాకు ముఖ్యకూడలి ప్రదేశమైన సామర్లకోట రైల్వే స్టేషన్‌లో సమస్యలు తిష్ట వేసినా, అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మూడు ప్లాట్‌ఫారాలు కలుపుతూ పార్శిల్ కార్యాలయం వద్ద కేవలం ఒక కాలిబాట వంతెన మాత్రమే ఉండటంతో, రైలు వచ్చిన సమయంలో ప్రయాణికులు ప్రమాదమని తెలిసినా.. పట్టాలు దాటి వెళుతున్నారు. రెండో కాలిబాట వంతెన నిర్మాణం చేస్తామని రైల్వే ఉన్నతాధికారులు గత పదేళ్లుగా చేసిన ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయి. గతంలో జీఆర్పీ స్టేషన్ వద్ద ఉన్న కాలిబాట వంతెనను తొలగించారు. మూడో నంబరు ప్లాట్‌ఫారంపై మొండిగా ఉన్న వాటి స్తంభాలు వెక్కిరిస్తున్నట్టుగా కనిపిస్తున్నాయి.

ప్రమాదకర పరిస్థితుల్లో..

సామర్లకోట నుంచి రాజమహేంద్రవరం వైపు విజయవాడ, హైదరాబాద్, చెన్నయ్ వంటి ప్రదేశాలకు వెళ్లడానికి రైళ్లు రెండు, మూడో నంబరు ప్లాట్‌ఫారాలకు వస్తాయి. దాంతో టిక్కెట్ తీసుకుని ప్రయాణికులు ఆయా ప్లాట్‌ఫారాలకు చేరుకోవాల్సి ఉంది. రైలు ప్లాట్‌ఫారంపై ఉన్న సమయంలో దానిని అందుకోవడానికి కొంత మంది ప్రయాణికులు అపాయమని తెలిసినా, హడావుడిగా పట్టాలను దాటుతున్నారు. నిత్యం 70 రైళ్ల రాకపోకల సందర్భంగా సుమారు ఏడు వేల మంది సామర్లకోట రైల్వే స్టేషన్ నుంచి ప్రయాణం చేస్తున్నారు. సంక్రాంతి పండగలో వీరి సంఖ్య మూడు రెట్లు ఎక్కువగా ఉంటుంది. సామర్లకోట రైల్వే జంక్షన్ కావడంతో, విశాఖపట్నం, విజయవాడ వైపు ప్రయాణం చేయడానికి కాకినాడ, కిర్లంపూడి, ప్రతిపాడు, జగ్గంపేట, ఏలేశ్వరం, పెద్దాపురం తదితర ప్రాంతాలకు చెందిన రైల్వే ప్రయాణికులు కచ్చితంగా సామర్లకోట నుంచే రాకపోకలు సాగిస్తారు.

అభివృద్ధి అంతంతమాత్రమే..

రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రైవేట్ టిక్కెట్ విక్రయాల యంత్రం ద్వారా సాధారణ ప్రయాణికుల నుంచి నెలకు సుమారు రూ.1.30 లక్షలు, రిజర్వేషన్ కౌంటర్ ద్వారా నెలకు సుమారు రూ.35 లక్షలు, బుకింగ్ కౌంటరులో సాధారణ టిక్కెట్ల విక్రయం ద్వారా నెలకు సుమారు రూ.ఐదు కోట్లు, పార్శిళ్ల ద్వారా నెలకు సుమారు రూ.ఏడు లక్షలు, గూడ్స్ షెడ్ ద్వారా నెలకు సుమారు రూ.30 లక్షల ఆదాయం వస్తుందని రైల్వే అధికారులు చెబుతున్నారు. నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే రైల్వేస్టేషన్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా ఉందని ప్రయాణికులు వ్యాఖ్యానిస్తున్నారు. రైల్వేస్టేషన్, బస్సు కాంప్లెక్స్ ఎదురెదురుగా ఉండటంతో పాటు, ఏడీబీ రోడ్డు చెంతనే ఉండటంతో, దొంగలు సులభంగా తప్పించుకుంటున్నారనే విమర్శలు లేకపోలేదు.

రెండో కాలిబాట వంతెన నిర్మించాలి



రైల్వే స్టేషన్‌లో ఒకే కాలిబాట వంతెన ఉండటంతో, సాధారణ ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. రైల్వే శాఖ ఎక్స్‌లేటర్ నిర్మిస్తుందని గత పదేళ్లుగా ప్రచారం జరుగుతోంది. ఇంతవరకూ ఏమీ లేదు. జిల్లాకు ముఖ్య కూడలి ప్రదేశమైన రైల్వే స్టేషన్‌లో సీసీ కెమెరాలు లేకపోవడం వింతగా ఉంది.

– కురుకూరి సోమేశ్వరరావు, ప్రయాణికుడు, సామర్లకోట

కాలిబాట వంతెన మంజూరు



రైల్వే స్టేషన్ పరిధిలో రెండో కాలిబాట వంతెన జీఆర్పీ పోలీసు స్టేషన్ దాటిన తరువాత నిర్మించడానికి అనుమతి లభించింది. కాలిబాట వంతెనతో పాటు, ఎక్స్‌లేటర్ నిర్మాణం జరుగుతుంది. సాధారణ ప్రయాణికుల కోసం ప్లాట్‌ఫారంపై షెడ్ల నిర్మాణం జరుగుతుంది. స్టేషన్ పరిధిలో 60 సీసీ కెమెరాలు ఏర్పాటుచేయడానికి వైరింగ్ పనులు పూర్తయ్యాయి. ఇంటర్ లాకింగ్ ఎలక్ట్రికల్ ప్యానల్ బోర్డులతో భవన నిర్మాణం జరుగుతుంది. ఆ భవనంలో స్టేషన్ మేనేజర్, సిగ్నల్ సిబ్బంది ఉంటారు.

– ఎం.రమేష్, స్టేషన్ మేనేజర్, సామర్లకోట

సమస్యల సత్వర పరిష్కారానికి గ్రీవెన్స్



అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆర్డీఓ కార్యాలయ ఏఓ కేవీ మాధవరావు అన్నారు. గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి ఏడు అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఏఓ మాధవరావు విలేకర్లతో మాట్లాడుతూ, డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. డివిజన్ స్థాయిలో అన్ని శాఖల అధికారులు గ్రీవెన్స్‌కు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టామన్నారు. స్పందనలో వచ్చే ప్రతి అర్జీని పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత శాఖాధికారిపై ఉందన్నారు. ప్రస్తుతం అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ డీటీ భానుకుమార్, సీడీపీఓ ఉష, హౌసింగ్ అధికారి రవిశంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సామర్లకోట బస్టాండ్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

సీఐ కృష్ణభగవాన్

సామర్లకోట: దేశవ్యాప్తంగా ఇటీవల కాలంలో పెరిగిపోయిన సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ ఎ.కృష్ణభగవాన్ అన్నారు. సోమవారం స్థానిక బస్ కాంప్లెక్స్ ఆవరణలో ప్రయాణికులు, విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పార్ట్ టైమ్ జాబ్స్‌తో రూ.లక్షలు సంపాదించవచ్చని, స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని ఆశలు చూపించి, డబ్బు కాజేస్తారని వివరించారు. అటువంటి వారితో అప్రమత్తంగా ఉండాలన్నారు. బంపర్ బొనాంజా పేరుతో మోసాలు జరుగుతాయని, బహుమతులు వచ్చాయని ఫోన్లు వస్తే జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం



యండపల్లిలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సుష్మ

కొత్తపల్లి: డెంగీను వ్యాప్తి చేసే ఏడిస్ దోమ పగలే కుడుతుందని, సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని వైద్యాధికారి సుష్మ అన్నారు. మండలంలోని యండపల్లిలో సోమవారం సీజనల్ వ్యాధులపై ప్రజకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలే అవకాశం ఉందన్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ఫ్లూ జ్వరాలు అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. వారిని ఉపాధ్యాయులు గుర్తించి, పాఠశాలలకు రాకుండా ఇళ్ల వద్దే విశ్రాంతి తీసుకునేలా చూడాలన్నారు. ఈ ఫ్లూ జ్వరాలు ఇతర విద్యార్థులకు సోకే ప్రమాదం ఉందన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక వైద్యం లేదని, లక్షణాలను బట్టి చికిత్సను అందించాలన్నారు. ఏడిస్ దోమ కుట్టినప్పటి నుంచి చలితో కూడిన జ్వరం, కళ్లు లాగడం, ఒళ్లు నొప్పి, వాంతులు, పళ్ల చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఆయా లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఇళ్ల వద్ద మురుగునీరు, ఇంటి పాత్రల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. గర్భిణులు, బాలింతలు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

రోడ్ల సమస్యను పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే చినరాజప్ప



సామర్లకోటలో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

సామర్లకోట: పెద్దాపురం నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన పట్టణంలోని 1, 9, 22, 24, 27, 30, 31 వార్డుల్లో బీపీఎస్ నిధులతో నిర్మించే సీసీ రోడ్లకు వారు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పట్టణంలోని డ్రైనుల్లో పూడికతీతకు నిధులు మంజూరు చేయించామని, పనులు జరుగుతున్నాయని చెప్పారు. వివిధ వార్డుల్లో రోడ్ల నిర్మాణానికి రూ.80 లక్షలతో శంకుస్థాపనలు చేశామని, మిగిలిన వార్డుల్లో రోడ్ల సమస్యను పరిష్కరిస్తామన్నారు. రోడ్ల పనులు 15 రోజుల్లో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించామన్నారు. స్థానిక సీహెచ్‌సీలో మెరుగైన వైద్యం అందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌడా చైర్మన్ తుమ్మల బాబు, మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, కౌన్సిలర్లు రెడ్డి లోవకుమారి, చల్లా వీరవెంకట సత్యనారాయణ, పిల్లాడి సత్యవతి, బలుసు వాసు, ఏఈ రమేష్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తొమ్మిది మూరల సాహెబ్ ఉరుస్

- హజ్రత్ మదీనా పాచ్ఛా ఔలియా గంధోత్సవం
- హాజరైన ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు



దర్గా వద్దకు గంధాన్ని తీసుకొస్తున్న ముస్లిం సోదరులు



ఉరుస్ సందర్భంగా జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న దవులూరి దొరబాబు

పెద్దాపురం: ప్రసిద్ధి చెందిన హజ్రత్ మదీనా పాచ్ఛా ఔలియా(తొమ్మిది మూరల సాహెబ్) ఉరుస్ ఉత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. కులమతాలకు అతీతంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా హాజరయ్యారు. మత సామరస్యానికి ప్రతీకగా పెద్దాపురం తొమ్మిది మూరల సాహెబ్ ఉరుస్ ఉత్సవం దోహదపడతుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు, కౌడా చైర్మన్ తుమ్మల బాబు అన్నారు. స్థానిక తొమ్మిది మూరల సాహెబ్ దర్గా వద్ద సోమవారం రాత్రి జరిగిన గంధోత్సవంలో వారు పాల్గొన్నారు. ముస్లిం పెద్దలు అబ్దుల్ గఫర్‌ఖాన్, ఎండీ లాయక్ అలీ, ఎంఎల్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థనల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు ఐక్యంగా ఏటా ఈ ఉరుస్ ఉత్సవం జరపడం అభినందనీయమన్నారు. మాజీ ఎమ్మెల్సీ నల్లమిల్లి శేషారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ తదితరులు హాజరయ్యారు. ఉరుస్ సందర్భంగా స్థానిక ఎండీ సత్తార్ ఇంటి వద్ద నుంచి గుర్రంపై గంధాన్ని ఊరేగింపుగా సమాధి వద్దకు తీసుకువచ్చారు. అనంతరం దర్గాపై గంధాన్ని పూసి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మిమిక్రీ, మ్యూజికల్ నైట్, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు నిర్వహించిన ఆత్మీయ విందును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సయ్యద్ జానీ, చలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా తదితరులు పాల్గొన్నారు.

పశువుల సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఏహెచ్ ఏడీ రామస్వామి



తాటిపర్తిలో రైతులకు పశువుల మందులను అందజేస్తున్న ఏడీ రామస్వామి

పెద్దాపురం: ప్రస్తుత కాలంలో పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై రైతాంగం అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం పశు సంవర్ధక శాఖ ఏడీ టీఎస్‌వీఏ రామస్వామి అన్నారు. మండలంలోని తాటిపర్తి, కాండ్రకోట గ్రామాల్లో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పశు వైద్య శిబిరాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీ రామస్వామి మాట్లాడుతూ, పశు సంవర్ధక శాఖ ద్వారా రైతులకు అందుతున్న సేవలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాడి పశువులకు ప్రస్తుత సీజన్‌లో వచ్చే వ్యాధులపై రైతులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తామని చెప్పారు. రైతులు మరింత అప్రమత్తమై, పశు వైద్య శిబిరాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రైతులకు పాడి పశువుల మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాండ్రకోట, దివిలి పశు వైద్యాధికారులు, రైతులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల కిటకిట



సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామివారు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తులు కిటకిటలాడారు. స్వామి వారికి ప్రీతైన రోజు కావడంతో ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, పూజలను పిఠాపురం మహారాజా గోత్రనామాలతో నిర్వహించారు. సోమవారం పర్వదినం కావడంతో లక్షపత్రి పూజలు జరిగాయి. ఆలయానికి వచ్చిన భక్తులు ధ్వజ స్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలు, ఆలయ పుష్కరిణి నుంచి నీళ్లతో స్వయంగా అభిషేకాలు చేశారు. ఆలయంలోని పెద్ద నంది, మూలవిరాట్ ఉప ఆలయాలలోని స్వామివార్లను, అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాదం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజగోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకటరమణ, చెరుకూరి సుందరరామయ్య, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



వాలు తిమ్మాపురంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

పెద్దాపురం: ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించాలని కాకినాడ ఆర్టీఓ శివారెడ్డి అన్నారు. మండలంలోని వాలు తిమ్మాపురంలోని ఓ పరిశ్రమలో పెద్దాపురం ఎంవీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం రహదారి భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాహన చోదకులు హెల్మెట్ ధరించాలని, సీట్ బెల్ట్ పెట్టుకోవాలన్నారు. రహదారి భద్రతా నియమాలను పాటిస్తే, కొంత వరకు ప్రమాదాలు నివారించవచ్చని చెప్పారు. రోడ్డు భద్రతా నియమాలపై ఆర్టీఓ అవగాహన కల్పించారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ కళాజ్యోతి, డాక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

భూ విలువ పెంపుపై 24 వరకు అభ్యంతరాల స్వీకరణ

కాకినాడ లీగల్: కాకినాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ఉన్న భూముల మార్కెట్ విలువ పెంపునకు సంబంధించి ఆన్‌లైన్‌లో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నోటీస్ బోర్డ్‌లో ప్రతిపాదనల కాపీలు పెట్టామని కాకినాడ జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1 ఆర్‌వీ రామారావు సోమవారం వెల్లడించారు. మార్కెట్ విలువపై అభ్యంతరాలను ఈ నెల 24వ తేదీ సాయంత్రం వరకు ప్రజల నుంచి స్వీకరిస్తామని చెప్పారు. పెరిగిన విలువలు ఫిబ్రవరి ఒకటి నుంచి అమలులోకి రానున్నాయి.

ఆర్టీసీలో మెరుగైన సేవలే లక్ష్యం

సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ద్వారకా తిరుమలరావు

కాకినాడ: ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ప్రతి ఉద్యోగి మరింత కష్టపడి పనిచేయాలని డీజీపీ, ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు అన్నారు. సోమవారం ఆయన కాకినాడ ఆర్టీసీ డిపోను సందర్శించారు. అక్కడ పరిసరాలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం కాకినాడ డిపో పరిధిలోని ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎండీ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ, మెరుగైన రవాణా సదుపాయాన్ని అందించడంలో ప్రతి ఉద్యోగి మరింత అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన కండక్టర్లు ఎంజే రావు, వీఎన్ మూర్తికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ విజయవాడ జోన్ డిప్యూటీ డైరెక్టర్ గొల్ల విజయరత్నం, కాకినాడ జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు, కాకినాడ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్లు కె.ప్రభాకరరావు, ఎస్‌కేఎం బాషా, పీఆర్వో సీహెచ్ వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ల్యాబ్ ప్రారంభించిన డీజీపీ

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌ను డీజీపీ ద్వారకా తిరుమలరావు సోమవారం సందర్శించారు. జిల్లా కేంద్రం కాకినాడకు విచ్చేసిన ఆయన ఏపీఎస్పీ బెటాలియన్‌లోని ఇంగ్లిషు మీడియం స్కూల్ సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఆయనకు బెటాలియన్ కమాండెంట్ దీపిక, సిబ్బంది స్వాగతం పలికారు. విద్యార్థులు నృత్యాలు చేసి డీజీపీని స్వాగతించారు. సైన్స్ ల్యాబ్ ప్రారంభించి విద్యార్థులకు ప్రయోగాలకు ఉపయోగించే కెమికల్స్ తదితర వాటిని పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్స్‌ను అభినందించి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఏపీఎస్పీ బెటాలియన్ క్యాంప్ కార్యాలయాన్ని సందర్శించి, శిక్షణ పొందుతున్న ముగ్గురు ట్రైనీ డీఎస్పీలు, బెటాలియన్ అధికారులతో మాట్లాడారు. ఐజీ జీవీకే అశోక్‌కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐపీఎస్ అధికారి సుస్మిత, అడిషనల్ కమాండెంట్ దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్‌లు పాల్గొన్నారు.